# విశాలాంధ్ర గోదావరి జిల్లా
## ఏలూరు, పశ్చిమగోదావరి

## పకడ్బందీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన ప్రక్రియ

**కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్**

**విశాలాంధ్ర-ఏలూరు:** ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన, ఎస్.ఎస్.ఆర్. 2024 అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు నెలాఖరు నాటికి పోలింగ్ కేంద్రాల పునర్విభజన కార్యక్రమం పూర్తిచేయవలసి వుందన్నారు. దీనిలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించి భవనాల మార్పుగానీ, పేరు మార్పుగానీ ఏమైనా ఉంటే ప్రతిపాదించవలసిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1736 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన ప్రక్రియ ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించవలసివుందన్నారు. పోలింగ్ కేంద్రాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల భవనాల మార్పు, పేరు మార్పుకు సంబంధించి సెప్టెంబరు 29వ తేదీన రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి సంబంధిత ప్రతిపాదనలు సెప్టెంబర్ 30 నాటికి ఎన్నికల కమీషన్ కు పంపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎవిఎస్ఎస్ మూర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు నెరుసు నెలరాజు(బిజెపి), యం. శ్రిరా భరత్ రావు(బిఎస్ పి), పాలి ప్రసాద్ (టిడిపి), ధశరధకుమార్, (ఆమ్ ఆద్మి పార్టీ) పాల్గొన్నారు.

## మధుబాబుకు సన్మానం

**విశాలాంధ్ర - కలిదిండి :** కర్ర సాములో గోల్డ్ మెడల్ సాధించిన అందుగుల మధుబాబుకు ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. బుధవారం మండలంలోని పోతుమర్రు పంచాయతీ శివారు గొల్లగూడెం గ్రామానికి చెందిన అందుగుల పాండు కుమారుడు మధు బాబు కర్ర సాము పోటీలలో

ఇండియా తరపున 9 దేశాలలో ఆడి గోల్డ్ మెడల్ సాధించి ఇండియా కీర్తిని ఎగరవేసినందుకుగాను దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మహానాడు అనుబంధాల సంఘాల అధ్యక్షులు సేవా. నాగ జగన్ బాబురావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలతో బాగా చదువుకుని దేశ గౌరవం, జాతి గౌరవం కాపాడాల న్నారు. గోల్డ్ మెడల్ సాధించిన మధుబాబును అభినందించారు.ఈ కార్యక్రమంలో జక్కుల. విజయ్ కుమార్, అందుగుల.ప్రతాప్, షేక్. గౌస్, బాపట్ల. పైడేశ్వరరావు, అద్దంకి కృష్ణ, గరికి ముక్కల రాజేష్, అందుగుల మహిత తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో మండలం

**విశాలాంధ్ర-కొయ్యలగూడెం :** మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రధాన లక్ష్యమని కొయ్యలగూడెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గంజిమల రామారావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి ఎస్సీ కాలనీని ఆనుకుని ఉన్న ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి 15 లక్షల

రూపాయలు మండల పరిషత్ నిధుల నుండి డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో భాగంగా పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో డ్రైనేజీ నిర్మాణాలు, సీసీ రహదారులు, నిర్మించడం జరుగుతుందని రామారావు తెలిపారు. మండలాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు, ఎంపీటీసీ గంట శ్రీనివాసరావు, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు మట్టా సత్యనారాయణ, వార్డ్ మెంబర్ పూలపల్లి రవికుమార్,పట్టణ అధ్యక్షుడు సంకు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## మానవత సంస్థకు రూ. 50 వేల విరాళం

**విశాలాంధ్ర - లింగపాలెం :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలను కొనియాడుతూ మఠంగూడెంకు చెందిన జాస్తి కన్నయ్యచౌదరి, లక్ష్మీ దంపతులు, మఠంగూడెం సొసైటీ మాజీ అధ్యక్షులు మందలపు వరప్రసాద్(బాబు) రూ. 25 వేలు చొప్పున విరాళం అందించారు. మానవత సేవా

సంస్థలో వీరు సభ్యులుగా చేరారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో లింగపాలెం మండలంలో యూనిట్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్టు సంస్థ కన్వీనర్ బలుసు సత్యనారాయణ తెలిపారు. ఈ సంస్థ పార్ధీవదేహాలకు ఉచితంగా ఫ్రీజరు, దహన సంస్కారాలు చేసేందుకు వాహన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కులమతాలకు అతీతంగా సంస్థ సేవలందిస్తుందని కన్వీనర్ తెలిపారు. మఠంగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి అడుసుమిల్లి నిర్మల, మోహిని, అమరవాణి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మాజీగూడెం ఆర్‌సీఎం గురువు ఆనంద్‌కు ఇటలీ ఆహ్వానం

**విశాలాంధ్ర - లింగపాలెం :** ఇటలీలోని రోమ్ పట్టణంలో జరిగే అంతర్జాతీయ ఆర్‌సీఎం సంస్థలోని విశ్వాసుల సభకు జరిగే ఎన్నికల్లో పాల్గొనేందుకు ధర్మాజీగూడెం ఆర్‌సీఎం మత గురువు జి.ఆనంద్‌కు ఆహ్వానం వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా 24 మంది డెలిగేట్స్‌ను గుర్తించారు. వీరు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును

వినియోగించుకుంటారు. వీరంతా కలిసి సుపీరియర్ జనరల్‌ను ఎన్నుకుంటారు. ఆరేళ్ళపాటు ఈ పదవి ఉంటుంది. ప్రస్తుత సుపీరియర్ జనరలగా ఫిలిప్ఫియన్ దేశానికి చెందిన జీసస్ రజాక్ కొనసాగుతున్నారు. ఈయన పదవీ కాలం ముగియటంతో ఎన్నిక జరుగుతుంది. ఫాదర్ ఆనంద్ ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు మంగళవారం ఇటలీకి బయలుదేరారు. ఎన్నిక ప్రక్రియ సెప్టెంబరు 1 నుంచి 25 వరకు కొనసాగుతుంది. సుపీరియర్ జనరల్ పదవితోపాటు నలుగురిని కౌన్సిలరలను ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలు పోప్ ఫ్రాన్సిసెస్ పర్యవేక్షణలో జరుగుతాయి. ఎంపికైన కమిటీ ప్రపంచ వ్యాప్తంగా సాంఘిక, సామాజిక, సువార్త సేవలు అందిస్తారు. ఆర్ధికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తారు. 24 మంది డెలిగేట్స్‌లో ధర్మాజీగూడెం గురువు ఆనంద్‌ను ఎంపిక చేయటంపై సంస్థ సభ్యులు, విశ్వాసులు, స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

# కపర్ది ఆశయాల సాధనకు పోరాడాలి

**శతజయంతి వేడుకల్లో వక్తల పిలుపు**

**విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం :** కార్మికహక్కుల సాధనకు అమరజీవి కపర్ది పోరాటస్ఫూర్తితో ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపు ఇచ్చారు. సుప్రసిద్ధ కార్మికనేత, ఆదర్శ కమ్యూనిస్టు, మార్క్సిస్టు మేధావి అమరజీవి కపర్ది శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఆయన నూరవ జన్మదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్దనున్న కపర్ది విగ్రహానికి వివిధ కార్మికసంఘాల నాయకులు, కార్యకర్తలు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత ఏఐటీయూసీ పతాకాన్ని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నేత ఎం.కోటేశ్వరరావు ఎగురవేశారు. ఈసందర్భంగా పెద్దసంఖ్యలో హాజరైన కార్మికులనుద్దేశించి డి.సోమసుందర్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రాంతపు కార్మికోద్యమ నిర్మాతగా, రాష్ట్ర స్థాయిలో ఆర్టీసి, మునిసిపల్, బ్యాంకు ఉద్యోగుల సంఘాల నేతగా కపర్ది సాగించిన కృషి చిరస్మరణీయమైనదని పేర్కొన్నారు.నాలుగు దశాబ్దాల పాటు కార్మిక శ్రేయస్సుకోసం కపర్ది చేసిన పోరాటాల ఫలితంగా కార్మికులు ఎన్నో హక్కులు

సాధించు కున్నారని సోమసుందర్ గుర్తు చేశారు. ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో పారిశుద్ధ్య కార్మికులకు సంఘం స్థాపించి, వారికి సమాజంలో ఒక గౌరవాన్ని తెచ్చి పెట్టారని అన్నారు. తాడేపల్లిగూడెం మునిసిపల్ పరిధిలో నేడు ఏడు వార్డుల్లో విస్తరించిన విమానాశ్రయ భూములను ఆక్రమించి ఇళ్ళు వేసుకున్న మూడువేల కుటుంబాలు కపర్ది కృషితోనే ఇళ్ళ సొంతదారులు అయ్యారని వీర్రాజు అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మిక, కర్షక వర్గాలను సంఘటితం చేసి వారి హక్కుల కోసం అమరజీవి కపర్ది చేసిన పోరాటాలలో ఎన్నో విజయాలు సాధించిన చరిత్ర ఉందన్నారు. ఆర్టీసీ డిపో కమిటీ అధ్యక్షుడు సి.హెచ్. వెంకటరమణ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో కపర్ది వెలుగులు నింపారని, వారి స్ఫూర్తితోనే ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మిక సమస్యలపై పోరాడుతున్నదని అన్నారు. ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే. లక్ష్మీనారాయణ, భవననిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ కమిటీ సభ్యులు పెద్దకాపు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు, జిల్లా కోశాధికారి మెండెం జేమ్స్, ఏరియా కమిటీ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, కోశాధికారి కాకర్ల రాంబాబు, పిల్లంగోళ్ళ కృష్ణ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కే.ముత్యం, కే. కాటమ రాజు, మండేల్లి రామకృష్ణ, రౌతు రాజేష్, శివ శంకర్, ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రమణ, పెద్దకాపు, బాషా, శివకుమార్, సి.డబ్ల్యు.సి. గోడౌన్ లేబర్ యూనియన్ నాయకులు తాడేపల్లి వెంకటేష్, పెనుబోతుల చంద్రరావు, ఏడుకొండలు, గాది శ్రీనివాస్, ఎస్.డబ్ల్యు.సి. గోడౌన్ లేబర్ యూనియన్ నాయకులు మాదాసు సత్యనారాయణ, చంద్ర శేఖర్, అనుబంధం మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్తిశెట్టి అప్పలరాజు, కార్యదర్శి సారిపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య అంశాలపై దృష్టి సారించాలి

**జవాబుదారీతనంతో గిరిజన ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం చేయాలి : కలెక్టర్**

**విశాలాంధ్ర - బుట్టాయిగూడెం :** గిరిజన గ్రామాలలో వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ ల నిర్మాణ పనులను సెప్టెంబర్, 15వ తేదీ లోగా చేసి వినియోగంలోకి తీసుకురావాలని, అందుకు భిన్నంగా నిర్మాణాలు పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. ఐటిడిఏ సమావేశపు హాలులో బుధవారం జరిగిన ఐ.టి.డి.ఏ పాలకవర్గ సమావేశంలో గిరిజన ఐ.టి.డి.ఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శాసనసభ్యులు తెల్లం బాలరాజు, జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, ఐ.టి.డి. ఏ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ తో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ఐ.టి.డి.ఏ పరిధిలో 37 వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ లను సెప్టెంబర్, 15వ తేదీలోగా పూర్తి చేయవలసి ఉండగా, పనులలో పురోగతి లేకపోవడం, మనబడి నాడు-నేడు పనులు కూడా నత్తనడకన కొనసాగడంపై గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికా రులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికా రులు తమ మైండ్ సెట్ ను మార్చుకుని గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో సస్పెన్షన్‌లు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు పూర్తిగా ఏర్పాటు చేయాలన్నారు. ఐ.టి.డి.ఏ

పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేయాలని, చింతపల్లి-గెడ్డపల్లి రోడ్డు నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖాధికారులతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ముంపు గ్రామాలలో రోడ్ల మరమ్మతు పనులను వరద పునర్నిర్మాణ నిధుల నుండి చేపట్టి పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాసన సభ్యులు తెల్లం బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నాయని, వీటి అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయా లని, తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా అటవీ శాఖాధికారి అరవింద్ దామా, జిల్లా పరిషత్ సీఈఓ కె. రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డి ఆర్ డి ఏ పీడీ విజయరాజు, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజు, జిల్లా వ్యవసాయాధికారి వై. రామకృష్ణ, డి ఎం హెచ్ ఓ డాక్టర్ డి. ఆశ, గిరిజన మండలాల ఎంపిపిలు, జెడ్పిటిసిలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సర్పంచ్ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆక్వాలో నూతన అన్వేషణలకు ఆహ్వానం

**విశాలాంధ్ర -భీమవరం :** ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆక్వా కల్చర్ సస్టయి నబుల్ డిజైన్ చాలెంజ్ పేరిట నూతన అన్వేషణలను

ఆహ్వానిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టరును ఆయన బుధవారం కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ పి.రామ్మూర్తిరాజు, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ కె.బ్రహ్మారాజు మాట్లాడుతూ ఆక్వా రైతాంగానికి ఉపయోగపడే డిజైన్ ప్రాజెక్టులను సెప్టెంబర్ 14వ తేదీలోగా భీమవరం పట్టణ పరిధిలోని వివిధ కళాశాలల్లో ఉన్న ఏ గ్రూపు విద్యార్థులైన ప్రతిపాదనలు పంపించవచ్చ న్నారు. తమ పరిశీలనకు వచ్చిన డిజైన్లను పరిశీలించి సెప్టెంబర్ 25వతేదీ లోపు సంబంధిత విద్యార్థికి సమాచారం అందించడం జరుగుతుందని వివరించారు. మంచి ప్రాజెక్టులకు రూ.25,000, రూ.15,000, పదివేలు చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని వారు వివరించారు. విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు రైతులు కొనుగోలు చేసుకునే స్థాయిలో ఉండేలా డిజైన్ చేయాలని ఆయన వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ రాజేష్, వీవీ మురళీకృష్ణమరాజు విద్యార్థి ప్రతినిధి తేజ తదితరులు పాల్గొన్నారు.

## యువ గళం పాదయాత్రకు విశేష స్పందన

**విశాలాంధ్ర-టి నరసాపురం:** తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువ గళం పాద యాత్రకు విశేష స్పందన లభిస్తోందని తెలుగు దేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. టి నరసా పురం మండలం తిరుమల దేవి పేట గ్రామ

పంచాయతీలో వైసిపి నుంచి 12 కుటుంబాలు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి గన్ని వీరాంజనేయులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ గళం పాదయాత్రతో ప్రజల్లో మార్పు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని చేరికలు వుంటాయని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పురోగతి లేదు,రాష్ట్రానికి రాజధాని లేదు,పరిశ్రమలు లేవని ధ్వజమెత్తారు. రాష్ట్రం సర్వతోముఖాభి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి శ్రీ జయవరపు శ్రీరామమూర్తి, మాజీ జడ్పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పిన్నమనేని మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

**ఒరిజినల్ పాసుపోర్టు పోయినది**

దగాని రవీంద్ర కుమార్, S/o. దగాని చెన్నయ్య, డో.నెం: 17-197రు, సుందరయ్య కాలనీ, ఎన్.టి.ఆర్. కాలనీ, పడమటి లాకులు, ఏలూరు, ఏలూరు జిల్లా.,నేను ది.19-08-2023వ తేదీన నా యొక్క ఒరిజినల్ పాసుపోర్టు నెం: K2595675ను ఒక కవరులో పెట్టుకుని మా ఇంటివద్ద నుండి మెయిన్ బజార్ వైభవ్ పోర్టు దగ్గర జిరాక్సు తీసుకొనుటకు వెళ్తుండగా మార్గమధ్యంలో సదరు నా ఒరిజినల్ పాసుపోర్టు పెట్టిన కవరు జారి పడిపోయినది. నేను మరలా మార్గమధ్యం లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఎంత వెదికినా నా యొక్క ఒరిజినల్ పాసుపోర్టు గల కవరు దొరకలేదు. నా ఒరిజినల్ పాసుపోర్టు దొరికిన వారు క్రింద అడ్రసులో అందచేయప్రార్థన.

దగాని రవీంద్ర కుమార్,
S/o. దగాని చెన్నయ్య, డో.నెం: 17-197,
సుందరయ్య కాలనీ, ఎన్.టి.ఆర్. కాలనీ,
పడమటి లాకులు, ఏలూరు, ఏలూరు జిల్లా.,

## ఎంపీగా నిలబడను

**-ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటా**

**- విశాలాంధ్రతో ఎంపీ కోటగిరి శ్రీధర్ అభిప్రాయం**

**విశాలాంధ్ర - లింగపాలెం :** జరగబోయే ఎన్నికల్లో ఎంపీకి గాని, మరే పదవికిగాని నిలబడ నని ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. ధర్మాజీగూడెంలోని సహ కార సంఘ చైర్‌పర్సన్ ఉప్పల పాటి వరప్రసాద్ నివాసానికి బుధవారం ఎంపీ వచ్చారు. ఈ సందర్భంగా విశాలాంధ్రతో మాట్లాడుతూ తనకున్న వ్యక్తిగత కారణాల వల్ల పోటీ చేయబోనని తెలిపారు. ఆర్థిక కారణాల వల్ల

ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నాననే అపోహలు వస్తున్నాయని, ఇది నిజంకాదని అన్నారు. ఆర్థికపరంగా తనకు ఇబ్బందులు లేవని తెలిపారు. రాజకీయ పదవులకు పోటీ చేయకపోయినా ప్రజలతోనే ఉంటానని పేర్కొన్నారు. తాను వైసీపీకి విధేయుడినని, దేశంలో ఏ సీఎం చేయని విధంగా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని, ఈయన అడుగుజాడల్లో కొనసాగుతానని తెలిపారు. ప్రత్యక్ష రాజకీయాలలో కాకుండా పరోక్ష రాజకీయాలలో సీఎం ఏ పని అప్పగించినా బాధ్యతగా పనిచేస్తానని అన్నారు.

## ప్రైమ్ 2.0 విధానం రద్దు చేయాలి

**విశాలాంధ్ర -భీమవరం:** స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా తీసుకొచ్చిన ప్రైం-2.0 విధానంతో ఆస్తుల వివాదాలు, కోర్టు వివాదాలు తలెత్తుతాయని, కొత్త విధానంలో లక్షలాది మంది లేఖలు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు ఉపాధి కోల్పోతారని ప్రైమ్-2.0ను వెంటనే రద్దు చేయాలని ది భీమవరం

లేఖరులు, స్టాంపు వెండర్లు అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రైమ్-2.0 విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు జిల్లా స్టాంప్సు రిజిస్ట్రార్ కార్యాలయం, భీమవరం, గునుపూడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వందల ఏళ్ల నుండి అమలులో ఉన్న రిజిస్ట్రేషన్ విధానాన్ని తప్పించి లోపభూయిష్టమైన ప్రైమ్-2.0 విధానాన్ని తీసుకు రావడంతో భవిష్యత్తులో ఎన్నో వ్యవస్థలు కుప్ప కూలిపోయాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైమ్-2.0 విధానంలోని లోపాలపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తాళ్లూరి మధు, గణిరెడ్డి మధు, గుండు హరిబాబు, వీరగొట్టపు అప్పారావు, నాగిడి విజయ సారధి, మేక నాగరాజు, కవురు పృధ్వి, మేక బ్రాహ్మయ్య, బొర్రా నాగరాజు, నడింపల్లి నాగరాజు, గిలకలశెట్టి దాడి హేమంత్ కుమార్, కేతా విజయ, మేక సతీష్, పి.చిరంజీవి, ఆరెపల్లి ధనరాజు, కంచెర్ల, పుల్లారావు, ఆరెపల్లి శంకర్, అయినూరి రామకృష్ణ, పాలూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉండిలో :** ప్రైమ్ 2.0 విధానంతో రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది లేఖర్లు డిటిపి ఆపరేటర్లు స్టాంప్ వెండర్లు రోడ్డున పడతారని ప్రభుత్వం ఈ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఉండి మండలం దస్తావేజు లేఖర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉండి సబ్ రిజిస్టర్

కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గవర్నమెంట్ రిజిస్ట్రేషన్ శాఖ వారు దస్తా లేకర్ల ప్రమేయం లేకుండా కక్షిదారులే రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో కలిసి దస్తావేజు రాసుకునే ప్రక్రియ ప్రైమ్ 2.0 అనే విధానం తీసుకురావడం బాధాకరమని దీనివలన లక్షలాదిమంది రోడ్లు పడే పరిస్థితి ఏర్పడుతుందని వారు వాపోయారు. ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునుకోలు సింహాచలం, కొమ్మన రాఘవయ్య, బురిడి రవిబాబు, నందుల నారాయణమూర్తి, బురిడి వీర్రాజు, మెట్టా సత్యనారాయణ ,లోకవరపు రాము, కలిగొట్ల పాండురంగ శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

## రావికంపాడులో లోకేష్ పాదయాత్ర

**విశాలాంధ్ర - కామవరపుకోట :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర బుధవారం చింతలపూడి నియోజకవర్గ రావికంపాడు గ్రామం చేరుకుంది. తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో

నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. పాదయాత్రలో ప్రజల నుండి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని తెలిపారు. రాబోయే కాలంలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యం అన్నారు. ఈ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, కిలారు సత్యనారాయణ, గంట సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## చింతలవల్లిలో ఆర్టీసీ బస్సును అడ్డగించిన విద్యార్థులు

**విశాలాంధ్ర -ముసునూరు:** ప్రభుత్వ బస్సును అడ్డగించి తమ గ్రామాల మీదగా వెళ్లాలంటూ ముసునూరు మండల విద్యార్థులు నిరసన చేసిన సంఘటన ముసునూరు మండలంలో జరిగింది. బుధవారం ముసునూరు మండలంలోని చింతలవల్లి గ్రామం

మీదగా లోపూడి వెళ్లే ఆర్‌టిసి బస్సు మరల తిరిగి వచ్చేటప్పుడు కూడా లోపూడి, బస్వావరప్పాడు, చెక్కపల్లి, గోగులంపాడు, చింతలవల్లి మీదగా నూజివీడు రావాలంటూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. నూజివీడు డిపో మేనేజర్ వచ్చి హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. నూజివీడు నుండి చింతలపూడి వెళ్లడానికి లోపూడి గ్రామం వైపు యర్రవారిగూడెం మీదగా 42 కిలో మీటర్లు మాత్రమేనని,ఆదే విసన్నపేట,చాట్రాయి గ్రామాల మీదగా వెళ్లాలంటే 65 కిలోమీటర్లు పైగా వుంటుందని రైతులు, వ్యాపారస్థులు ఈ రూట్‌లో ఆర్‌టిసి బస్సు నడపాలని కోరుతున్నారు.

## వరిలో కాండం తొలుచు పురుగులను నివారించాలి

**విశాలాంధ్ర - గణపవరం:** వరి పండించే రైతులు వరిలో ఎక్కువగా కాండం తొలుచు పురుగులు ఉన్నాయని వాటి నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఈ తెగులు వలన కాండం లోపల కణుపులు ఏర్పడి ఆ భాగ

మంతా నల్లగా మారుతుందని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి. మురళీకృష్ణ అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పన్నపేట గ్రామంలో డాక్టర్ వైయస్సార్ గుడ్ ఆగ్రో కల్చరల్ ప్రాక్టీసెస్ (పొలంబడి) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరి పంటలో ఎలుకల ద్వారా కలిగే నష్టాల నియంత్రణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గణపవరం మండల వ్యవ సాయ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, సర్పంచ్ నక్కా సూరి బంగారయ్య, ఎంపీటీసీ కొల్లి సత్యనారాయణ, ఎస్. సుధాకరరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**విశాలాంధ్ర - పెనుమంట్ర:** ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని పెనుగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర రావు తెలిపారు. బుధవారం బ్రాహ్మణ చెరువు పోలీస్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహన దారులకు ప్రమాదాల

నియంత్రణకు హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఈ నిబంధన పాటించాలని అన్నారు. లేనిపక్షంలో ఏవీఐ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, పరిమితికి మించి ప్రయాణికులు వాహనాల్లో వెళ్లడం, వంటి వాటిని నియంత్రించగలిగితే రోడ్డు ప్రమాదాలు జరగవని ఆయన అన్నారు. ఆయనతోపాటు పెనుమంట్ర ఎస్సై బి. సురేంద్ర కుమార్ , స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ

**విశాలాంధ్ర -నూజివీడు :** బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దబోయిన వెంకటేశ్వరరావు కోరారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన నూజివీడు నియోజకవర్గ ముఖ్య నాయకులు,మండల పార్టీ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో సెప్టెంబర్ 1 నుండి 45 రోజుల పాటు భవిష్యత్తుకు గ్యారెంటీ - బాబు ష్యూరిటీ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల పార్టీ అధ్యక్షులు ముసునూరు రాజా ,ముసునూరు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్య , ఆగిరిపల్లి మండల పార్టీ అధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరావు, చాట్రాయి మండల పార్టీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు , నూజివీడు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ప్రజాబలం కోల్పోయింది

**విశాలాంధ్ర - భీమవరం టౌన్ :** తెదేపా ప్రజాబలం పూర్తిగా కోల్పోయిందని, దీంతో దొడ్డి దారిన అధికారం లోకి రావాలని చంద్రబాబు నానా తంటాలు పడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో పదివేల వైసీపీ ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నా రని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో

పదివేల మంది వైసీపీ ఓట్లను తొలగించేందుకు ఇక్కడ టిడిపి నాయకులు కుట్ర చేశారని, బ్రతికున్న వైసీపీ సానుభూతిపరులను మరణించినట్లుగా వారి ఓట్లను తొలగించాలని తెలుగుదేశం నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారని అన్నారు. సమాచార హక్కు చట్ట ప్రకారం తాము ఓటర్ల జాబితాను తీసుకుని పరిశీలించడం జరిగిందని అన్నారు. తన తల్లి గ్రంధి వెంకటరత్నం, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, నాచు శేషగిరిరావు లాంటి అనేకమంది బ్రతికుండగానే వారు మరణించా రని తెలుగుదేశం పార్టీ ఎన్నికల అధికారులకు రిపోర్ట్ చేయడం చాలా దారుణమని అన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు సరైన గుణపాఠం ప్రజలే చెబుతారన్నారు.

## పేదలకు అండగా ఫ్యామిలీ డాక్టర్

**విశాలాంధ్ర-ఏలూరు:** ప్రతి పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి. ఆశ తెలిపారు. పేదలు ఆసుపత్రుల చుట్టూ, డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన

అవసరం లేకుండా గ్రామాలకే అన్ని వైద్య సేవలు అందించే గొప్పకార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అన్నారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇప్పటి వరకు 27 మండలాల్లోని 482 గ్రామ సచివాలయాల పరిధిలో 6,82,550 మందికి వైద్య సేవలు అందించబడ్డాయని ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి. జోషిరాయ్ తెలిపారు.

## దాతల సహకారంతో దేవాలయాలు అభివృద్ధి చేయాలి

**విశాలాంధ్ర - గణపవరం:** గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు దాతలు సహకారంతో నూతన దేవాలయాలు, పురాతన దేవాలయాలు అభివృద్ధి చేయాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. బుధవారం గణపవరం మండలం, కేశవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి గ్రామ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి దేవాలయానికి అభివృద్ధి కమిటీలు వేసి వాటి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నాయకులు దండు మురళి కృష్ణంరాజు, గ్రామ సర్పంచ్ మిడతాని కామేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు వేగేశ్న విజయ దుర్గేష్ నందిని, మిడతాని నాగేశ్వరావు, తోట స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళా ప్రజాప్రతినిధులు

**విశాలాంధ్ర - ఉంగుటూరు :** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకి మహిళా ప్రజాప్రతినిధులు బుధవారం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సోదరిసోదరుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్ర ప్రతీక రాఖీ పౌర్ణమి అని అన్నారు. రాష్ట్రంలో మహిళలు అందరికి ఒక అన్నగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కి మహిళలందరూ అండగా నిలవాలని కోరారు. ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, రాయి లక్ష్మి, సర్పంచి సునీత, జిల్లా వైయస్సార్ పార్టీ కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మందా జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ కళ్యాణమండపంలో శ్రావణ పౌర్ణమి వేద సభ

**విశాలాంధ్ర - గణపవరం:** శ్రావణ పౌర్ణమి పురస్కరించుకొని వేదసభ నిర్వహించినట్లు బ్రాహ్మణ సంఘం నాయకులు కాళ్ళకూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. గణపవరం మండలం సరిపల్లి గ్రామంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణ మండపంలో బుధవారం వంద మంది వేద విద్యార్థులతో నాలుగు వేదాలతో కూడిన పరీక్షలు చేయడానికి అధికారులు హాజరయ్యారు. ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి నాడు కళ్యాణ మండపంలో వేద మంత్రాలతో పూజలు చేస్తారు. ఈ వేద విద్యార్థులకు భోజన వసతులు కల్పించిన గణపవరం గ్రామానికి చెందిన సాగిరాజు సుబ్బరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రామలింగరాజు, సాగిరాజు సాయి రాజు, ఆదిత్య వర్మ, దెందుకూరి ప్రసాదరాజు, ప్రజలు పాల్గొన్నారు.

## 2న ఉంగుటూరుకు లోకేష్ పాదయాత్ర

**విశాలాంధ్ర -ఉంగుటూరు :** టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర వచ్చే నెల రెండో తేదీన మధ్యాహ్నం ఉంగుటూరు మండల వస్తుందని ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. బుధవారం ఉంగుటూరు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రకు సంబంధించి టీడీపీ ముఖ్యనాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాదయాత్ర రూట్ మ్యాప్ ను పరిశీలించారు. అలాగే పాదయాత్రకు సంబంధించి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఇక్కడే లోకేష్ కు టిడిపి నాయకులకు కార్యకర్తలకు లంచ్ బ్రేక్ ఉంటుందని గన్ని అన్నారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రెడ్డి చందు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పాతూరి విజయ్ కుమార్, నల్ల ఆనంద్ కుమార్, కడియాల రవిశంకర్, బందారు మధుబాబు, ఇమ్మని గంగాధర్, నేకూరి ఆశీర్వాదం, గంటా యువరాజు, డిడ్ల శ్రీనివాసు, సప్ప వీరబాబు, పాతూరి సత్యనారాయణ, పుసులూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హెల్త్ హౌస్ సర్వే

**విశాలాంధ్ర-ఉంగుటూరు :** నేషనల్ హెల్త్ హౌస్ సర్వే టీం 8మంది సభ్యు లతో మూడురోజుల పాటు ఉంగుటూరు గ్రామంలో సర్వేచేస్తున్నారు. టీం సభ్యులు బుధవారం ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసు కుంటు న్నారు. టీం సభ్యులకు ఉంగుటూరు భద్రకాళి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న గెస్టుహౌస్‌లో విడిది ఏర్పాటు చేశారు. కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, భద్రకాళి సేవాదళ్ చైర్మన్ పాతూరి వంశీకృష్ణ పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యం

**విశాలాంధ్ర- ఉంగుటూరు :** కుల, మత,రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉంగుటూరు శాసన సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో గుర్తించిన 25 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీకు ఇచ్చిన పట్టాలకు స్థానిక విఆర్వోలు భూమి ఎక్కడ ఉందో చూపిస్తారని అందులో ఇల్లు కట్టుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.1,80,000 రుణం ఇస్తుందని పేర్కొన్నారు. తహసీల్దార్ ఏవీ రమణారావు, ఆర్ఐ సిరిగినీడి సత్యనారాయణ, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగారావు, జిల్లా పంచాయతీ రాజ్ సెల్ అధ్యక్షులు పుప్పాల గోపి పుప్పాల గోపి, ఉంగుటూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజనేయులు, మండల సచివాలయ కన్వీనర్ డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ,సర్పంచ్ బంగారు సింధుమధు బాబు, ఆయా గ్రామాల వైకాపా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## దేవాలయాల పరిరక్షణ బీజేపీ ధ్యేయం

**విశాలాంధ్ర -కైకలూరు :** మన దేవాలయం - మన హక్కు నినాదంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపు మేరకు కిసాన్ మూర్చ ఏలూరు జిల్లా అధ్యక్షులు కీర్తి వెంకట్ రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణం లోని శ్యామలాంబ అమ్మవారి ఆలయం ముందు వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగిన మన దేవాలయం మన హక్కు కార్యక్రమంలో భాగంగా హిందూ బంధువుల వద్ద నుండి 1004 సంతకాలు సేకరించి ఈ ఉద్యమంలో వారిని కూడా భాగస్వాముల్ని చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జద్దు వీర వెంకట సత్యనారాయణ, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి బొల్లా శ్యామల రాజు గౌడ్, కిసాన్ మోర్చా సోషల్ మీడియా ఏలూరు జిల్లా కన్వీనర్ మేడిశెట్టి అయ్యప్ప స్వామి,తలారి శేషగిరి,శవ్వల దుర్గాప్రసాద్, గంగుల గంగరాజు నేరెళ్ళ శ్రీను, తానంకి సాయి, బండి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా పోరాడి సమస్యలను పరిష్కరించుకుందాం

**విశాలాంధ్ర - పెనుమంట్ర:** సాగులో ఎదురవుతున్న సమస్యలపై సమిష్టిగా పోరాడి పరిష్కరించుకుందామని ఆక్వా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు పిలుపునిచ్చారు. జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో పెనుమంట్రలో సంగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి ఆక్వా రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సాగులో ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతున్నాయని చెప్పారు. ధర విషయంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విద్యుత్, ధరలు, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో నాయకులు బోణం చిన్నబాబు, దాట్ల సోంబాబు, సోమరాజు, భూపతిరాజు శ్రీనివాసరాజు, వేగేశ్న సాయి రాజు, వివిధ గ్రామాల ఆక్వా రైతులు పాల్గొన్నారు.

## డబ్బులిచ్చి మోసపోయిన బాధితులకు న్యాయం చేస్తా : ఎంపీ శ్రీధర్ హామీ

**విశాలాంధ్ర - లింగపాలెం :** ధర్మాజీగూడెంలో అప్పులు ఇచ్చి మోసపోయిన బాధితులను ఎంపీ కోటగిరి శ్రీధర్ బుధవారం కలిసి వారికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్నారు. కష్టపడి కూడపెట్టుకున్న సొమ్మును వడ్డీ పేరుతో ఆశ చూపి కాజేశాడంటూ బాధితులు ఎంపీకి వివరించారు. బ్యాంకు ఉద్యోగం చేస్తున్న బాబూ రావు, మరో వ్యక్తి తమను మోసగించారని వీరు తెలిపారు. తమకు న్యాయం చేయాలని వీరు కోరారు. తమ డబ్బును ఇప్పించాలని మొరపెట్టారు. వీరి ఆవేదన విన్న ఎంపీ ఎస్పీ మేరీ ప్రశాంతికి ఫోన్‌లో బాధితుల బాధను వివరించారు. వీరికి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా తగిన స్పందన ఇప్పటివరకు లేదని ఎంపీ ఎస్పీకి తెలిపారు. దీనిపై స్పందించిన ఎస్పీ పది రోజుల్లో నిందితులను పట్టుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. బాధితుల తరపున సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్, లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ మాట్లాడారు. ఎంపీ జోక్యంతో ఎస్పీ స్పందించటంతో బాధితులు న్యాయం జరుగుతుందనే ఆశను వ్యక్తం చేశారు. ఎంపీ వచ్చిన సందర్భంగా కార్మిక సంక్షేమ శాఖ వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు కొఠారు మోహన్, పలువురు సర్పంచ్‌లు, వివిధ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.

## యాళ్ల సాగర్ బాబుకు అభినందనలు

**విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారి గూడెం గ్రామానికి చెందిన యాళ్ల సాగర్ బాబు భారత జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ పరీక్షలో విజయం సాధించి తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరి క్యాడర్లో పోస్టింగ్ పొందినందుకు ప్రముఖ విద్యావేత్త డాక్టర్ అలుగు ఆనంద్ శేఖర్ అభినందించారు. బుధవారం స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో దళిత, గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డాక్టర్ ఆనంద్ శేఖర్ అధ్యక్షతన యాళ్ళ సాగర్ బాబుకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అలుగు ఆనంద శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు జాతీయ స్థాయిలో ఉద్యోగం పొందడం సాధారణ విషయం కాదన్నారు.ఎంతో పట్టుదల,దీక్ష,కృషి ఉంటేనే అది సాధ్యమవుతుందన్నారు. ఐఆర్ఎస్ విజేత సాగర్ బాబు మాట్లాడుతూ సాధారణమైన గ్రామీణ ప్రాంత విద్యా సంస్థలలో విద్యాభ్యాసం చేసి మూడవ ప్రయత్నంలో ఐఆర్ఎస్ సాధించానని తెలిపారు. తాను పుట్టిన ప్రాంత అభివృద్ధికి అవకాశం ఉన్న మేరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానుకొండ కిషోర్, నాటక శాల వెంకటరాజు, న్యాయవాది గర్సికూటి రాంబాబు, కోడేటి సత్యనారాయణ సత్యానందం రమేష్ ,సత్యనారాయణ, దీపక్, మల్లిపూడి రవి, బ్యాటరీ నాగు, వంశి ,రవిబాబు ,సోమన ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ ప్రతిభ అవార్డు అందుకున్న ఎస్విజీ స్కూల్

**విశాలాంధ్ర - పెనుమంట్ర:** జిల్లా క్రీడా ప్రతిభ అవార్డుకు మార్టేరు శ్రీ వేణుగోపాలన్నత పాఠశాల ఎంపికైంది. ఈ జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని భీమవరంలో జరిగిన కార్యక్రమంలో డీఈఓ నుంచి హెచ్ఎం సిహెచ్ సి ఎస్ ఎస్ రెడ్డి తో కలసి ఈ అవార్డు అందుకున్నట్లు పాఠశాల పిడి కర్రి కృష్ణారెడ్డి తెలిపారు. 2022-23 గాను జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులన్న పాఠశాలను ఈ అవార్డుకు ఎంపిక చేశారన్నారు.తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీల్లో పథకాలు సాధించారన్నారు. దీనిని పరిగణలోకి తీసుకుని 47 పాయింట్లతో జిల్లాలో తమ పాఠశాల నాలుగు స్థానంలో నిలిచినట్లు చెప్పారు. అవార్డు అందుకోవడం పట్ల ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ, ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి, జడ్పిటిసి కర్రి గౌరీ సుభాషిని, తదితరులు అభినందనలు తెలిపారు.

## భీమడోలు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద లేఖర్లు పెన్ డౌన్

**విశాలాంధ్ర - భీమడోలు :** రిజిస్ట్రేషన్‌లను అన్ని పాత పద్ధతుల్లో స్టాంపుల ద్వారా కొనసాగించాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు ఏలూరు జిల్లా భీమడోలులో దస్తావేజులేఖర్ల సంఘం పెన్ డౌన్ కార్యక్రమాన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఏఎన్ఎస్ఆర్.శర్మ కు లేఖర్ల సంఘ నాయకులు వినతిపత్రం అందజేసారు. ఈసందర్భంగా లేఖర్ల సంఘనేతలు నందూరు శ్రీరామ్, వర్ధినీడి బాల మురళీకృష్ణ, శీమకుర్తి మురళి మాట్లాడుతూ లేఖర్ల వ్యవస్థను బ్రిటీష్ కాలం నుండి 1906లో ఏర్పాటుచేశారని, నేటివరకు కొనసాగుతుందని ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖర్ల వ్యవస్థను నాశనం అవుతుందని తెలిపారు. ప్రైమ్ 2.0 వ్యవస్థ వల్ల పూర్వం బ్రిటిష్ కాలం నాటి దస్తావేజు పోయి తెల్లకాగితంపై దస్తావేజులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో బాలనాగు వేంకటేశ్వరరావు, నిమ్మల విశ్వ క్రిష్ణ బాలాజి, వెజ్జు నాగేశ్వరరావు, వరిగొండ విక్రమ్, వేమన సుధాకర్, పడవల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నా చెల్లళ్ల అనుబంధానికి ప్రతీక రఖీ

**విశాలాంధ్ర-ఆకివీడు :** అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే పండుగ రాఖీ పౌర్ణమి అని. డిసిసిబి చైర్మన్ , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇంచార్జ్ పివిఎల్ నరసింహారాజు అన్నారు. బుధవారం ఆకివీడు శ్రీమతి సరోజినీ నాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఆకివీడు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పిల్లలకు మన పండగలు, సాంప్రదాయాల గురించి తెలిపే విధంగా ఈ కార్యక్రమం చేపట్టిన పాఠశాల సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆకివీడు ఏఎంసీ చైర్మన్ షేక్ రసూల్ బేబీ, వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ మోరా జ్యోతి, విద్యార్థులు ఆయనకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్ , వైస్ ఎంపీపీ కిల్లి రామకృష్ణ, అంబటి రమేష్, గుర్రం హరితో పాటు వాలంటరీలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాల పంపిణీ

**విశాలాంధ్ర - కరప :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరలు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు రాష్ట్రంలో జరుగు నిరసన కార్యక్రమంలో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. రాజశేఖర్ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం కరప మండలం గొర్రిపూడి, గురజానపల్లి గ్రామాలలో సిపిఎం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలను, అవలంబిస్తున్న విధానాలను ఈ సందర్భంగా ప్రజలతో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. రాజశేఖర్ తెలిపారు.

## సారా నిందితులకు జైలుశిక్ష

**విశాలాంధ్ర -బిక్కవోలు:** సారా నిందితులకు ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు బిక్కవోలు ఎస్సై బుజ్జిబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన అంబటి కొండయ్య, మామిడాడకు చెందిన కుడుపూడి కిరణ్ కుమార్, వాళ్ళిద్దరి దగ్గర 2020లో సారాతో పట్టుబడడంతో కేసు నమోదు చేసి అనపర్తి కోర్టులో హాజరు పరిచారు. అనపర్తి జేఎఫ్‌సి ఎం మెజిస్ట్రేట్ పి. చైతన్య వారికి ఆరు నెలలు జైలు శిక్ష పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

## యానాం మద్యం స్వాధీనం

**విశాలాంధ్ర - పాలకొల్లు :** పాలకొల్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ లంక చిరంజీవి ఆధ్వర్యంలో ఎస్సై షేక్ ఖాసిం తన సిబ్బందితో కలిసి బుధవారం అనధికార మద్యం రవాణాపై తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనిఖీల్లో ఒక కారులో 75 యానాం మద్యం సీసాలు కలిగిన చౌటా చంద్రశేఖర్ అనే వ్యక్తిని పాలకొల్లు పట్టణంలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. అతని వద్ద ఉన్న మద్యం సీసాలను, కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసామని సిఐ చిరంజీవి తెలిపారు. అనధికారికంగా ఇతర రాష్ట్రాల మద్యం సీసాలు మన రాష్ట్రానికి తరలించడం చట్టరీత్యా నేరమని, ప్రజలు ఈ విష యంలో నిబంధనలను వ్యతిరేకిస్తే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

## తాడిపర్రులో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

**విశాలాంధ్ర - ఉండ్రాజవరం:** తాడిపర్రులో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం సంఘ అధ్యక్షుడు మట్టా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది లక్షల రూపాయలతో నిర్మించిన దేవాలయానికి అనేకమంది భక్తులు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. వేదమంత్రాలతో హోమాలు నిర్వహించారు. వాయిద్యాల సందడిలో విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, సంఘ కార్యవర్గ సభ్యులు వంతపాటి కృష్ణమూర్తి, వి సుబ్బారావు, వి. గోవిందు, గాలి శ్రీను, నాగళ్ళ శ్రీను, పాశం రామకృష్ణ తదితరులు, పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నియోజకర్గంలో జనసేన పార్టీకి ఎదురు దెబ్బ

**విశాలాంధ్ర - సీతానగరం:** రాజానగరం నియోజకవర్గంలో జనసేన పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. 2019 ఎనికల్లో రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రాయపురెడ్డి చిన్నా సీఎం జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్సీపీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాయపూరెడ్డి చిన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితుడినై వైకాపాలో చేరినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జక్కంపూడి రాజా అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

## నెహ్రూను పరామర్శించిన పాత్రికేయులు

**విశాలాంధ్ర -గోకవరం :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గంపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూను బుధవారం ఆయన స్వగ్రామమైన ఇర్రిపాకలో గోకవరంమండల ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు . నెహ్రూ సోదరీ, వియ్యపురాలు తోట నాగలక్ష్మి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో నెహ్రూని ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించి సానుభూతి తెలియజేశారు. నెహ్రూ ను పరామర్శించిన వారిలో మద్దాల బ్రదర్స్, కరాసు శివరామకృష్ణ, మోటపర్తి ఆనంద్, మైపాల పాండురాజు, కొంగరపు రాజు, కంచుమర్తి రాజశేఖర్, మెప్పెల్లి జయరాజు, పెరవలి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నా చెల్లెలు అనుబంధాన్ని చాటేదే రక్షాబంధన్

**విశాలాంధ్ర-బుట్టాయిగూడెం :** రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళా ప్రజా ప్రతినిధులు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ సమాజంలో అన్నా చెల్లెలు, అక్కా తమ్ముల్ల మధ్య అనుబంధాన్ని చాటేది రక్షా బంధన్ అన్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపతున్న మహిళా ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక అన్నగా, ఒక తమ్ముడిగా వారికి ఎప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఎమ్మెల్యే బాలరాజుకు రాఖీ కట్టిన వారిలో కొయ్యలగూడెం జెడ్పిటిసి దాసరి శ్రీలక్ష్మి, వేలేరుపాడు జెడ్పిటిసి బుజ్జా రామలక్ష్మి, వేలేరుపాడు యంపిపి దేవి, టి. నర్సాపురం యంపిపి డి. లక్ష్మీ ఉన్నారు.

## వినాయకుడి గుడి ప్రారంభోత్సవంలో జగ్గిరెడ్డి

**విశాలాంధ్ర - ఆత్రేయపురం :** మండలం కేంద్రంలో నార్కెడ్ మిల్లి గ్రామంలో బీసీ ఏరియాలో నూతనంగా నిర్మించిన వినాయకుడి గుడి ప్రారంభోత్సవం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి చిర్ల జగ్గిరెడ్డికి తీర్ధ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, ఎంపీటీసీ పాలా చిన్న వెంకటరమణ, ఎక్స్ ఎంపీటీసీ బాలం బాబురావు, గ్రామ వైఎస్ఆర్సిపి ప్రెసిడెంట్ వై శివ రామ కృష్ణ మరియు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపం ప్రారంభోత్సవం

**విశాలాంధ్ర - ఆలమూరు :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన ఆలమూరులో స్థానిక భువనేశ్వరి చెరువుగట్టు వద్ద అత్యాధునిక హంగులతో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపాన్ని బుధవారం ఘనంగా

ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి కొత్తపేట శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిర్ల మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే నిధుల నుండి 50 లక్షల రూపాయలు మంజూరు చేయించి నిర్మాణం పనులను ప్రారంభించామన్నారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు జిల్లా పరిషత్ నిధుల నుండి 15 లక్షల రూపాయలను మంజూరు చేయించామని తెలియజేశారు. ఆలమూరు మండలంతో పాటు పరిసర ప్రాంతాల వారికి ఈ కళ్యాణమండపం ఎంతో సౌకర్యంగా ఉంటుందని అందరూ వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఈ కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వ నిధులతో పాటు పలువురు కాపు నాయకుల వద్ద నుండి నిధులు సేకరించి అహర్నిశలు శ్రమించిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి, మండల కాపు సంఘం అధ్యక్షులు, డాక్టర్ చల్లా ప్రభాకర్ రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బందారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బందారు శ్రీనివాస్, ఎంపీపీ తోరాటి లక్ష్మణ్ రావు, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఎన్ లావణ్య కుమార్ రాజా, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు కట్టని భూములకు వేలం పాటలు నిర్వహించాలి

**విశాలాంధ్ర - గోకవరం :** వేలంపాటలో పాడుకుని డబ్బులు కట్టని భూములకు తక్షణమే వేలంపాటలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్ మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములు వేలంపాటలు నిర్వహించడంలో ఎండోమెంట్ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లోనై కాలయాపన చేస్తున్నారని అన్నారు. గతంలో రైతు కూలీ సంఘం పోరాడగా కొంత భూమిని వేలంపాటలు నిర్వహించారని, ఆ వేలంపాటలు నిర్వహించినప్పుడు వేలం పాటలో భూమి దక్కించుకున్న వారు ఒక సంవత్సరం శిస్తు ముందుగా చెల్లించాలని, చెల్లించలేని పక్షంలో ఆ భూమిని మరల వేలంపాటలు నిర్వహిస్తామని, ఎండోమెంట్ అధికారులు నిబంధనలు పెట్టారన్నారు. కానీ నిబంధనలు పెట్టిన అధికారులే అధికార, ప్రతిపక్ష నాయకుల ఒత్తిళ్లకు లోనై కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే వేలంపాటలో పాడుకుని శిస్తు చెల్లించని 21 ఎకరాలు మరియు పెండింగ్లో ఉన్న 16 ఎకరాలు మొత్తం 37 ఎకరాలకు భూములకు బహిరంగ వేలంపాటలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడిసె చెల్లారావు గోలి ముసలయ్య కడవల అప్పారావు,వడ్లపాటి వెంకటలక్ష్మి,పిడిఎస్యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు ఆఖరు వరకు అభ్యంతరాల స్వీకరణ

**విశాలాంధ్ర-భీమవరం:** ఓటర్ల సవరణ ప్రక్రియ లో భాగంగా క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ స్వీకరణ సెప్టెంబర్ నెలాఖరు వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ జరుగుతుందని, అప్పటివరకు సవరణ జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ మొదటి వారం లోగా పోలింగ్ స్టేషన్ల ఫైనలైజేషన్ చేయాలని అన్నారు. 1500 ఓటర్లు కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్ల లో కొత్త పోలింగ్ స్టేషన్ల ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ లోపుగా తహశీల్దార్లు అన్ని పోలింగ్ స్టేషన్ల ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి చెక్ లిస్ట్ ఇవ్వాలని అన్నారు. సదరు మార్పుల పై జిల్లా స్థాయిలో చర్చించి ఎన్నికల కమిషన్ కు పంపడం జరుగుతుందన్నారు. తొలగించబడిన ఓటర్లను మరొకసారి సరిచూసుకోవాలని ఇఆర్వోలకు, ఎఇఆర్వోలకు జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## బీజేపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**విశాలాంధ్ర - ఉంగుటూరు :** తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి నియామకాల్లో ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం బిజెపి ఆధ్వర్యంలో సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరులో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద, భక్తుల వద్ద సంతకాలు చేస్తున్నారు. బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, తదితరులు ఉన్నారు. బొమ్మిడిలో కూడా మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు అనంతలక్ష్మి ఆధ్వర్యంలో సంత కాల సేకరణ చేశారు.

## యువగళం పాదయాత్ర విజయవంతానికి పూజలు

**విశాలాంధ్ర - అమలాపురం :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం అమలాపురం పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి కోసం యువతీ యువకుల అభివృద్ధి కోసం నారా లోకేష్ గత రెండు వందల రోజులుగా విజయవంతంగా చేస్తున్న యువగళం పాదయాత్ర మరింత విజయవంతంగా ముందుకు కొనసాగాలని లోకేష్‌కి ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని తెలుగుదేశం పార్టీని అభివృద్ధి పదం వైపు నడిపించాలని వైష్ణవి దుర్గ అమ్మవారి ఆలయం నందు తెలుగు మహిళలందరూ కొబ్బరికాయలు కొట్టి రాఖీలు సమర్పించి పూజలు చేయించారు. ఈ సైకో జగన్ పాలన పోయి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మహిళలందరూ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మీడియా కోఆర్డినేటర్ మాకిరెడ్డి విఎన్ఎస్ పూర్ణిమ, నియోజకవర్గ అధ్యక్షురాలు గెల్ల మీనా కుమారి, పేరూరి విజయలక్ష్మి ఇతర మహిళలు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ కర్ణాటక రాష్ట్ర చైర్మన్‌గా రాజా అమర్నాథ్

**విశాలాంధ్ర-ఆకివీడు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ వైస్ చైర్మన్ గా నిర్వహిస్తున్న, ప్రముఖ న్యాయవాది రాజా అమర్నాథ్ ను ఆ సంస్థ కర్ణాటక రాష్ట్ర చైర్మన్ గా నియమించినట్లు బుధవారం రాజా నివాసం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిన్నసూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు వ్యాపార అభివృద్ధికి ఉపయోగపడే విధంగా రుణ సదుపాయం కలిగిస్తామని. దేశంలో నిరుద్యోగులందరికీ వారి సామర్థ్యాన్ని బట్టి ఉపాధి కల్పించడం ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు.